నీళ్లు నిలిచి.. జనజీవనం స్తంభించి..

- భారీ వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- రహదారులపై తగ్గని వరద, రాకపోకలకు ఇబ్బందులు
- నీట మునిగిన పంట పొలాలు



ఆత్మకూర్(ఎస్): నెమ్మికల్‌లో వరద వల్ల రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు



చివ్వెంల : వాల్యతండా గ్రామ శివారులో అలుగుపోస్తున్న పెద్ద చెరువు



సూర్యాపేట పట్టణంలో అలుగుపోస్తున్న సద్దల చెరువు



ఆత్మకూర్(ఎస్) చెరువు అలుగు వల్ల పంట పొలాల్లో మునిగిన మోటార్లు

ఆత్మకూర్(ఎస్) : బుధవారం కురిసిన భారీ వర్షంతో మండల వ్యాప్తంగా చెరువులు అలుగుపోస్తున్నాయి. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణ మొత్తం నీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో పాఠశాల హాస్టల్‌లోని విద్యార్థినులను ఇళ్లకు పంపించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో నీరు చేరడంతో విద్యార్థులను ఇళ్లకు పంపడంతోపాటు ప్రైవేట్ మోటార్లతో నీటిని ఎత్తి బయటకు పంపారు. భారీ వర్షాలతో నెమ్మికల్లు గ్రామంలో గంపల దయాకర్ ఇంటి స్లాబ్ కుంగిపోయింది. భయాందోళనకు గురైన దయాకర్ కుటుంబ సభ్యులు వేరే ఇంట్లోకి వెళ్లారు. నెమ్మికల్‌లోని దండు మైసమ్మ ఆలయ సమీపంలో రోడ్డుపై నుంచి వరద భారీగా వెళ్తుండటంతో రోడ్డు మధ్యలో బొంగ ఏర్పడి రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు రోడ్డుపై పడ్డ బొంగ వద్ద రాళ్లు వేయించి ప్రయాణికులు సురక్షితంగా వెళ్లేలా చూశారు. పలు గ్రామాల్లో పత్తి, వరి పొలాల గుండా వరద భారీగా వెళ్తోంది.

వరద ఉధృతి పరిశీలన

నూతనకల్ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో వరద పరిస్థితిని జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఎల్‌పీఓ నారాయణరెడ్డి గురువారం పరిశీలించారు. గుండ్లసింగారంలోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జిని పరిశీలించారు. సోమ్లాతండా-తాళ్లసింగారం రహదారిపై నుంచి తాళ్లసింగారం చెరువు అలుగుపోతుండటంతో రాకపోకలు నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. గుండ్లసింగారం బ్రిడ్జి పిల్లర్ల వద్దకు కొట్టుకువచ్చిన చెట్లను సత్వరమే తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. మండల కేంద్రంలో నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, ఎంపీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల పరిధిలోని గ్రామాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. పంట పొలాలు నీట మునగడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాల్యతండా గ్రామ శివారులోని పెద్ద చెరవు అలుగు పోయడంతో వాల్యతండా, జగనాతండా నుంచి మండల కేంద్రానికి వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు వాగు దాటకుండా అధికారులు కంప అడ్డు వేసి అప్రమత్తం చేశారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మద్దిరాల : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు అలుగు పోస్తున్నాయి. గురువారం భారీ వర్షం కురిసింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని తహసీల్దార్ అయేషా పర్వీన్, ఎస్ఐ వీరన్న, ఎంపీడీఓ సత్యానారాయణరెడ్డి సూచించారు.

తగ్గని వరద.. లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో బుధవారం రాత్రి నుంచి మళ్లీ వర్షం కురుస్తూనే ఉంది. దీంతో అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ బాలికల కళాశాలకు వరద కొనసాగుతోంది. అర్వపల్లిలోని తుంగతుర్తి రోడ్డులో ఇళ్ల వెంబడి నీళ్లు నిలిచాయి. అలాగే పోస్టాఫీస్ ఎదుట నీరు నిలిచింది. అర్వపల్లిలో జాతీయ రహదారి వెంబడి కాలువలు పూడిపోయి వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. రామన్నగూడెం వద్ద కూడా హైవేపై వర్షపు నీరు నిలిచింది. పలు గ్రామాల్లోని పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నాగారం : వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈఈ ఎస్.మహేంద్రకుమార్ అన్నారు. వర్షాలకు మండల కేంద్రంలో 11 విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో గురువారం మరమ్మతు పనులు చేయించి మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకాలు ఉన్నా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఇంజనీర్ ఎండీ నజీర్‌సాబ్, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, లైన్‌మన్ ఆనందరావు, జేఎల్ఎం అంజయ్య, సిబ్బంది సురేష్, చిలక రాంరెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్) : మోడల్ స్కూల్ చుట్టూ చేరిన వరద నీరు



అర్వపల్లి : కేజీబీవీ ఆవరణలో నిలిచిన నీళ్లు



చివ్వెంల : వరద వెళ్తున్న రోడ్డుపై రాకపోకలు ఆపుతున్న అధికారులు



నాగారం : విద్యుత్ మరమ్మతు పనులు చేయిస్తున్న ఏఈఈ



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో అలుగుపోస్తున్న దేవి చెరువు



అర్వపల్లిలో పోస్టాఫీస్ ఎదుట నిలిచిన నీళ్లు

క్లుప్తంగా

రంగయ్యగూడెం వాసికి రాష్ట్రపతి మెడల్



కరుణాకర్

పెన్‌పహాడ్‌:మండల పరిధిలోని రంగయ్యగూడెం గ్రామానికి చెందిన డీసీపీ తొగరు కరుణాకర్ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రపతి మెడల్‌కు ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీలో చీఫ్ మార్షల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం భారత రాష్ట్రపతి మెడల్‌కు ఎంపికచేసింది. మెడల్‌కు ఎంపికకావడం పట్ల గ్రామస్తులు, మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం



అమ్మవారికి ఫల పుష్పాలు తీసుకువస్తున్న ఆలయ చైర్మన్ కరుణాకర్ రెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్‌లో దండు మైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవాల సందర్భంగా గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దండు మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి దంపతులు అమ్మవారికి ఫల పుష్పాలు సమర్పించి గోపూజ, వేద పఠనం, ఆలయ ప్రదక్షిణ, గురుప్రార్థన, గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, మూలమూర్తి పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ కుశలయ్య, దేవాలయ కమిటీ సభ్యులు రేణిగుంట్ల సునీత, జంగా బాలరాజు, మోరపాక రాజు, గోపగాని లక్ష్మి, పేరం శ్రీనివాస్, బొడ్డుపల్లి విజయలక్ష్మి, పచ్చిపాల శ్రీను, కాసర్ల రాంరెడ్డి, వీరబోయిన రేణుక, మోరపాక లచ్చయ్య, బోర రాములు, ఎరుకల సర్వయ్య, చెరుకుపల్లి రాంబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సూర్యాపేట : పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యా నిలయం పాఠశాలలో గురువారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం యూనియన్ బ్యాంకు మేనేజర్ సాకేత్ పాల్గొని విజేతలకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ కార్యదర్శి యానాల వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు గుండా రమేష్, పాల్నేని నరేందర్, నాగవెల్లి ప్రభాకర్, దశరథ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు స్వాతి, పుష్ప, రమ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న మహాధర్నా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగెళ్ల జితేందర్ రెడ్డి, తీగల నరేష్, జిల్లా ట్రెజరీ అధికారి రవికుమార్, టీఎన్జీఓ జిల్లా సెక్రటరీ జనరల్ దున్న శ్యామ్, టీజీఓ జిల్లా సెక్రటరీ జనరల్ పాండు నాయక్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందన్నారు. సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ బషీర్, లక్కపాక ప్రవీణ్ కుమార్, శివశంకర్, రామలింగారెడ్డి, సత్యనారాయణ, తావీర్య, ధర్మయ్య, ఎల్లయ్య, మేకల రాజశేఖర్, గోదేశి దయాకర్, కొల్లు సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌కు పరామర్శ

నూతనకల్ : ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుల వెంకన్న యాదవ్‌ను పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డిలు గురువారం పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకన్నను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లింగాల రామచంద్రు, గుగులోతు కృష్ణ, నెల్లుట్ల మహేష్, మద్ది లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

చివ్వెంల : బి.చందుపట్లకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గుద్దేటి లచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు ఏర్పాట్లు



ఎంపీడీఓ కార్యాలయాన్ని రంగు కాగితాలతో ముస్తాబు చేస్తున్న సిబ్బంది

అర్వపల్లి : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అర్వపల్లిలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, ఇతర కార్యాలయాలను గురువారం ముస్తాబు చేశారు. రంగు కాగితాలు, మామిడి తోరణాలతో అలంకరించారు.

మద్యపాన నిషేధంలో ఆదర్శంగా..



మద్యపాన నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న గట్టికల్లు గ్రామస్తులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని గట్టికల్లు గ్రామంలో మద్యపానం నిషేధం అమలుచేస్తూ ఆ గ్రామస్తులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో బెల్ట్ షాపులతో యువత మద్యానికి అలవాటు పడి చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారని, కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని భావించిన గ్రామస్తులు గ్రామంలో మద్యం అమ్మకాలు నిషేధించాలని నిర్ణయించుకున్నారు. గత సంవత్సరం అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున మద్యపానం నిషేధంపై తీర్మానం చేశారు. డప్పు చాటింపు చేయించి, ర్యాలీలు నిర్వహించారు. మద్యం వల్ల కలిగే అనర్థాలపై అధికారులతో ప్రజలకు అవగాహన కల్పించారు. అప్పటినుంచి గ్రామంలో మద్యం అమ్మకాలు ఆగిపోయాయి. గట్టికల్లు మద్యపాన నిషేధ గ్రామంగా ఉంటూ.. మండలంలో మిగతా గ్రామాలకు సైతం ఆదర్శంగా నిలుస్తోంది.

నేడు పనులకు శంకుస్థాపన

సూర్యాపేట : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం సూర్యాపేట పట్టణంలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ పి.రాంబాబులతో కలిసి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. బుధవారం 17 మంది ఫోన్ చేసి సమస్యలు తెలియజేయగా అన్నీ పరిష్కరించినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ మరో 48 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లను గుర్తించి వాటిల్లో ఉండే ప్రజలను రిలీఫ్ క్యాంపులోకి తరలించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. కల్వర్టులు, బ్రిడ్జిల పైనుంచి నీరు ప్రవహిస్తే అక్కడ సిబ్బందిని అప్రమత్తం చేయాలని, ప్రధానంగా జాతీయ రహదారులపై నీరు నిలవ్వఉండకుండా చూడాలన్నారు. వైద్యశాఖ సిబ్బంది ప్రసవాలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వరదల తర్వాత సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నాణ్యమైన తాగునీరు సరఫరా చేయాలని, వరదలతో పైప్‌లైన్లు తెగిపోతే క్లోరినేషన్ టెస్ట్ చేసిన తర్వాతే నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, ఆర్డీఓ వేణుమాధవ్, డీపీఓ యాదగిరి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సీతారామయ్య, పీఆర్ ఈఈ మాధవి, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సీపీఓ కిషన్, డీఎంహెచ్ఓ చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్, ఇరిగేషన్ అధికారి నవికాంత్, మిషన్ భగీరథ శ్రీనివాస్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్య తలెత్తనివ్వొద్దు

అర్వపల్లి: సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా గ్రామపంచాయతీ సిబ్బంది చూడాలని జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి కోరారు. గురువారం అర్వపల్లిలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రజలు చెత్త, వ్యర్థ పదార్థాలను రోజూ తమ ఇళ్ల ముందుకు వచ్చే ట్రాక్టర్‌లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తిరునగరి గోపి పాల్గొన్నారు.

జాగృతి జిల్లా అధ్యక్షురాలిగా సూరారపు కృష్ణవేణి



నూతనకల్ : తెలంగాణ రాష్ట్ర జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన సూరారపు కృష్ణవేణి నియమితులయ్యారు. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత గురువారం హైదరాబాద్‌లో జిల్లా అధ్యక్షురాలుగా ఆమెను ప్రకటించారు. కృష్ణవేణి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కవితకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



సూర్యాపేట : ర్యాలీ నిర్వహిస్తున్న భారతీయ జనతా పార్టీ నాయకులు

సూర్యాపేట : పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీస్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా గాంధీ విగ్రహం వరకు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతరెడ్డి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలతరెడ్డి మాట్లాడారు. తిరంగ పతాకం కేవలం ఒక జెండా కాదు, అది మన స్వాతంత్ర్యం, గౌరవం, త్యాగం, జాతీయ ఐక్యతకు ప్రతీక అని అన్నారు. మన దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, మనం కూడా దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు, ప్రముఖులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, పాఠశాల, కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తిరుమలగిరిలో తిరంగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల బంగారు రాజు, పట్టణ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్‌రెడ్డి, కూరాకుల వెంకన్న, ఎ.సోమయ్య, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, శ్యామ్, సిద్ధార్థ, శ్రీనివాస్, కొమురయ్య, వెంకన్న, హరీష్ పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వైభవంగా బోనాల పండుగ

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో బోనాల పండుగను ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బోనాలతో ఊరేగింపుగా ముత్యాలమ్మ ఆలయం వద్దకు వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూర్(ఎస్) : కందగట్లలో బోనాలతో వెళ్తున్న మహిళలు



పెన్‌పహాడ్ : నాగులపాటి అన్నారంలో..



మద్దిరాలలో బోనాలతో వెళ్తున్న మహిళలు



తిరుమలగిరి : గుండెపురిలో..



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో బోనాల ఊరేగింపు



అర్వపల్లిలో ముత్యాలమ్మ ఆలయం వద్ద..

పంటలు మునిగి నష్టపోయిన రైతులు



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్ : వర్షాలకు పంటలు మునిగి రైతులు నష్టపోయారని, ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 20 నుంచి 31 వరకు సర్వేలు నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు ప్రజా సమస్యలపై గ్రామ సచివాలయాలు, మండల కార్యాలయాల ఎదుట వేలాది మంది ప్రజలను సమీకరించి ధర్నాలు నిర్వహిస్తామని అన్నారు. సెప్టెంబర్ 22న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విగ్రహం ఏర్పాటు చేయాలి

నాగారం : సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పైన విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేయకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీకి చెందిన కంచుకట్ల రాములు (ఉపాధ్యాయుడు) గురువారం కిరాణం సరుకులు కొనేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అతడి కాళ్లకు, చేతులకు గాయాలై రక్తస్రావం అవుతుండటంతో 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.